క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పతివాడపాలెంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రణస్థలం: ప్రతి ఒక్కరూ మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరి బాబు అన్నారు. ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా పతివాడపాలెం శివాలయం ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. హరిబాబు మాట్లాడుతూ భూతాపం బాగా పెరిగిపోయి, దేశంలో పలు నగరాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పి.తవిటినాయుడు, పి.రమణ, వై.లహరి, ఆర్.భవాని, ఎం.వి రత్నాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: సీజనల్ వ్యాధుల పట్ల వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ సూచించారు. మండలంలోని దీఆర్వలస ఆరోగ్య కేంద్రంలో రోగులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ మంచాలకు పరిమితమైన రోగులకు ఇంటివద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని వెల్లడించారు. వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: సమగ్ర సర్వశిక్ష పథకం అధికారులు సూచనల మేరకు ఎచ్చెర్ల మండలంలో అన్ని గ్రామాల్లో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు సహిత విద్య ఉపాధ్యాయులు సింగిరెడ్డి రమణ, కింతలి అరుణ కుమారి చెప్పారు. ఎచ్చెర్ల భవిత కేంద్రంలో సోమవారం వివరాలు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు సహకారంతో ఈ సర్వే నిర్వహించి చిన్నారులను గుర్తిస్తున్నట్లు వివరించారు. 18 ఏళ్లలోపు దివ్యాంగులను సైతం గుర్తిస్తున్నట్లు వివరించారు. విద్య, పౌష్టికాహారం అందించటం, రవాణా సౌకర్యం కల్పించటం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి సహాయ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దలు సైతం సహకరించాలన్నారు. ప్రత్యేక అవసరాలు చిన్నారులు, దివ్యాంగుల వివరాలు ఫోన్ నంబర్లు 9505393810, 9160379212 లకు తెలియజేయాలన్నారు.

పరామర్శ..



కన్నంనాయుడు తండ్రిని పరామర్శిస్తున్న సాయికుమార్

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల కన్నంనాయుడు తండ్రి అనారోగ్యంలో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, కంది ఈశ్వరరావు, కింజరాపు జగన్‌మోహన్ తదితరులు బాతువ గ్రామానికి సోమవారం వెళ్లి పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు బూటు అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ సన్యాసిరావు, పార్టీ నాయకులు బూటు హరి, రమణ, నారాయణరావు ఉన్నారు.

సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షంనీరు



రోడ్డుపై నిలిచిన నీటిలో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం సమీపంలో గల 16వ నంబర్ జాతీయ రహదారిలో ఉన్న సర్వీస్ రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నీరు నిలిచిపోయింది. డ్రైనేజ్ సౌకర్యం లేకపోవటం, రోడ్డు పల్లపు ప్రాంతంలో ఉండటంతో నీరు నిలిచింది. వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో పాడవుతుంది.

● కల్యాణ వైభోగం



శ్రీకాకుళం నగర పాలకసంస్థ పరిధి సీపన్నాయుడుపేటలోని శ్రీరామమందిరం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా అర్చకులు బంకుపల్లి అప్పలనర్సింహశర్మ, సుధీర్‌శర్మల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పి.నాగరాజు, అలివేలు మంగమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

● అన్నదానం



రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకంలో భాగంగా హరికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత హరికా ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రోగులకు అన్నదానం చేశారు. లయన్స్ హర్షవల్లి క్లబ్ అధ్యక్షుడు వి.జగన్నాథం నాయుడుయ క్లబ్ జోనల్ చైర్మన్ శోభారాణి, ప్రతినిధులు చింతాడ కృష్ణమోహన్, టి.అప్పలనాయుడు, మణిశర్మ, సత్యస్వరూప్, జీఎస్‌టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

● ద్వాదశి వేడుకలు



శ్రీకాకుళం గుడివీధిలో బలరామ ప్రతిష్ఠ దేవాలయంగా ప్రసిద్ధి పొందిన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ద్వాదశి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. రకరకాల పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా, వారిలో ఆసక్తిని పెంచేలా వినూత్న రీతిలో వేసవి వినోద కార్యక్రమాలను వచ్చే వేసవిలో రూపొందిస్తామని క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వేసవి వినోదం పేరిట నాలుగు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు వివిధ అంశాల్లో ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ఉచిత ప్రత్యేక శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులను అందజేశారు. శిక్షణ శిబిరం బాగా కొనసాగిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి కొత్తకోట అప్పారావు, పొందూరు అప్పారావు, బి.శ్రీరామ్మూర్తి, ఎం.వాసుదేవరావు, ఉపాధ్యాయులు, 90 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాలు.. వాటి అవశ్యకతపై వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్. శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజు, కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రాజాం జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సమ్మర్ క్యాంప్‌లో 14వ (ఏ)బెటాలియన్ జిల్లా ఎన్‌సీసీ విద్యార్థులకు రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన కారక్రమం సోమవారం జరిగింది. జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యత్వంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 512 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా శాంతిభద్రతలకు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేయటంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని సరుబుజ్జిలి ఎస్సై బి.నిహార్ హెచ్చరించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున బాణసంచా కాల్చటం, ఊరేగింపులు నిర్వహించటం, స్వీట్స్ పంచటం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించవద్దన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా మసులుకోవాలని సూచించారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఆమదాలవలస: సామాజిక సేవలు సంతృప్తి ఇస్తాయని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొల్లి తోషిక అనే చిన్నారి పుట్టినరోజు సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆమదాలవలస పట్టణంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా పలు సాంఘిక, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే రక్తదాన శిబిరాలు, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, సురేష్, ప్రదీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాలు నిషేధం



మాట్లాడుతున్న మహమ్మద్ యాసిన్

పాతపట్నం: గ్రామాల్లో విజయోత్సవాలు, మందుగుండు సామగ్రి కాల్చవద్దని, ర్యాలీలు నిర్వహించకూడదని పాతపట్నం ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు వైన్ షాపులు మూసివేయించామన్నారు. ఎవరైనా మందు రవాణా చేసినా, మందు అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని గ్రామాల్లో పోలీసు నిఘా ఉందని, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బూర్జ: మండల కేంద్రంలో గల జగన్నాథ స్వామి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 6వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాన అర్చకులు గోపీస్వార సాహు ఆధ్వర్యంలో భక్తు ప్రత్యేక పూజలు, దర్శనాలు, భజనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఉచిత వైద్యసేవలు



ఈసీహెచ్‌ఎస్ ప్రత్యేక కౌంటర్ ప్రారంభోత్సవంలో మాజీ సైనికులు, ఆస్పత్రి ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మాజీ సైనికులకు మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్పత్రిలో ఈసీహెచ్‌ఎస్ ప్రత్యేక కౌంటర్‌ను డాక్టర్ దానేటి శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికులు, కుటుంబీకులు మెడికవర్‌లో ఈనెల ఐదో తేదీ నుంచి 24/7 వైద్య సేవలను అందిపుచ్చుకోవచ్చన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు అంతా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆస్పత్రి యాజమాన్యానికి చెల్లిస్తుందన్నారు. ఇక్కడ మాజీ సైనికులకు ప్రత్యేక కౌంటర్ ఉంటుందని చెప్పారు. మాజీ సైనిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికవర్ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం జిల్లా సమాఖ్య తరఫున కృషి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెడరేషన్ చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు బి.సంజీవరావు, తమ్మినేని కృష్ణారావు, ఎస్.ఎల్.రావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, ట్రెజరర్ ఎం.సింహాచలం, మహిళా సెక్రటరీలు ఎ.లక్ష్మి, కె.జగ్గమ్మ పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఖాతాదారుల అవస్థలు



బ్యాంక్ బయట వేచివున్న ఖాతాదారులు

బూర్జ: మండల కేంద్రంలో గల ఏపీజీవీబీలో సోమవారం ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. బ్యాంక్‌కు వివిధ పనులు నిమిత్తం వచ్చినవారు సాయంత్రం వరకు నిరీక్షించావల్సి వచ్చింది. పింఛన్లు, ఖరీఫ్ లోన్లు, నగదు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన వారికి ఇబ్బందులు తప్పలేదు. ఖాతాదారులు బ్యాంకు బయట నిరీక్షించారు. ఆదివారం సాయంత్రం వర్షంతో పాటు పిడుగులు పడటంతో ఇంటర్నెట్‌లో సమస్య వచ్చిందని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు.

తప్పిన ప్రమాదం



సరుబుజ్జిలి: కూలిన శ్లాబుపెచ్చు

సరుబుజ్జిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ గది పైకప్పు సోమవారం కూలిపోయింది. శ్లాబుకు చెందిన పైపెచ్చు ఊడిపోవడం వల్ల సీలింగ్‌కూడా ఊడిపోయింది. ఆ సమయానికి ఆరోగ్య కేంద్రం సిబ్బంది వేరొక గదిలో ఉండడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



సారవకోట: సమావేశ మందిరానికి ఎదురుగా నేలకూలిన చెట్లు

ఈదురుగాలుల బీభత్సం

సారవకోట: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండల పరిషత్ సమావేశ మందిరం ఎదురుగా ఉన్న చెట్లు నేలకొరిగాయి. కొన్ని చెట్లు కొమ్మలు విరిగి సమావేశ మందిరానికి వెళ్లే దారిలో పడిపోయాయి. సోమవారం వీటిని తొలగించే ప్రయత్నాన్ని సంబంధిత సిబ్బంది, అధికారులు చేపట్టలేదు.

సాగునీటి కాలువలు బాగుచేయాలి



సరుబుజ్జిలి: పూడికపోయిన కాలువను చూపిస్తున్న రైతులు

సరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువకు సుభద్రాపురం గ్రామం వద్ద అనుసంధానంగా నిర్మించిన 17ఎల్ పిల్ల కాలువ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల రైతులకు సాగునీరు అందక ప్రతి ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుభద్రాపురం వద్ద గల వంశధార కుడి ప్రధాన కాలువ నుంచి సమీపంలో ఉన్న ఇల్లాన్నాయుడు చెరువుకు సాగునీరు నిండిన తదుపరి దిగువన గల నక్కలపేట, పెద వెంకటాపురం, చినవెంకటాపురం, పాలవలస, అవతరాబాద్, సూర్యనారాయణపురం, రావివలస తదితర గ్రామాలకు చెందిన 8 చెరువులు నింపాలి. రైతులకు అత్యవసర సమయంలో సాగునీరు అందించేందుకు అధికారులు నిర్ణయించారు. ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సిన 17ఎల్ పిల్ల కాలువ పూర్తిగా పూడికపోయింది.



బూర్జ: జిలి గెడ్డలో పెరుకుపోయిన పిచ్చిమొక్కలు

గజిలి గెడ్డలో..

బూర్జ: బూర్జ గజిలి గెడ్డలో పూడికలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గజిలి గెడ్డ బిట్–2లో కింద ఏడాది ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడితతీత పనులు చేపట్టారు. అయినప్పటికీ గజిలి గెడ్డలో పిచ్చి మొక్కలు పెరిగి సాగునీటికి ఇబ్బందికరంగా మారాయి. రూ.4,72,340లతో చేపట్టిన పనులు అంతంత మాత్రంగానే జరిగాయని స్థానికుల విమర్శిస్తున్నారు. గెడ్డలో పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కిడ్నీ వ్యాధితో మరణించిన స్నేహితుడు కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల జోగారావు రెండు కిడ్నీలు పాడైపోయి ఇటీవల మరణించారు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద మరణంతో వీరు ఆర్థిక ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న బొడ్డపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2008 విద్యా సంవత్సరంలో మృతుడు జోగారావుతో కలిసి పదోతరగతి చదువుకున్న మామిడిపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు మద్దిల లింగరాజు, వంకల పాపారావు, పిట్ట జోగారావు, జుత్తు లక్ష్మణరావు, వంకల షణ్ముఖరావు, మద్దిల ధనుంజయ, సార సాంబమూర్తి, జుత్తు శ్రీనివాసరావు, వంకల ధనలక్ష్మి, రాపాక ధమయంతి, సార రాజేశ్వరి పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని స్నేహితుడు భార్యకు సోమవారం అందజేశారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతాంగ ప్రతినిధులు

పలాస: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ జీడి రైతాంగ కమిటీ జిల్లా కార్యదర్శి తెప్పల అజయ్‌కుమార్ కోరారు. ఉద్దానం ప్రాంత జీడి రైతాంగానికి ఇచ్చిన హామీని రాబోయే కొత్త ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. జీడి రైతుల కష్టాలను గట్టెక్కించాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని రోజులుగా పలాస నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మాకన్నపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ పోరాటం జరుగుతుందని, ఈ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోనేరు గురయ్య, నెయ్యల గణపతి, కుత్తుం వినోద్, తవిటయ్య, సాతుపల్లి కృష్ణారావు, జుత్తు నాగేష్, తెప్పల కూర్మారావు ఉన్నారు.

జోరుగా పూండి రహదారి పనులు



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సీఎంవో (ముఖ్యమంత్రి కార్యాలయం హై ఇంపాక్ట్) నిధులు రూ. 2.90 కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నారు. బెండి గేటు జంక్షన్ నుంచి పాతటెక్కలి వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. పూర్తిగా పాడైన ప్రాంతంలో రోడ్డును వెట్‌మిక్స్‌తో ఎత్తు చేసి దానిపై బీటీ రహదారి నిర్మిస్తున్నారు. వారం రోజుల్లో రహ దారి పూర్తవుతోందని ఆర్అండ్‌బీ ఏఈఈ డి.విక్ర మ్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టి కి మంత్రి సీదిరి అప్పలరాజు పూండి రహదారి సమస్యను తీసుకెళ్లడంతో ఈ నిధులు మంజూరైయ్యాయి. పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com